ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

ఆదివారం
16 ఫిబ్రవరి
2025





# ఆకట్టుకున్న ఎస్.వీ.ఎన్ జెండర్ ఈక్వాలిటీ ప్రదర్శనలు

## విద్యతోనే మార్పు సాధ్యం సీఐ రమేష్... వండర్ కిడ్స్ స్కూల్ లో అడ్మిషన్ల కోసం 8434242494 నంబర్లు సంప్రదించాలి

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: మహిళలు ఆర్థిక,రాజకీయ,సామాజిక రంగాలలో రాణించాలంటే విద్య తప్పనిసరి అని యాదగిరిగుట్ట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బీసీ కాలనీలో నిర్వహించిన జెండర్ ఈక్వాలిటీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభకు ఎస్.వీ.ఎన్ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్ అధ్యక్షత వహించారు. నేటి ఆధునిక యుగంలో కూడా కొంతమంది ఈక్వాలిటీ విషయంపై చర్చ చేయాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో సగభాగంలో ఉన్న మహిళలకు అదే స్థాయిలో హక్కులు అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆడ, మగ తేడా లేకుండా సమాన స్థాయిలో ఆడపిల్లలకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదని ఆయన వివరించారు. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలోకి వెళుతుందని చెప్పారు. ఇప్పటికీ  ఇండియా అభివృద్ధి చెందుతున్న దేశంగా మాత్రమే ఉన్నదని గుర్తు చేశారు. దానికి మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక, వెనుకబాటుకు గురి కావడమేనని చెప్పారు. విద్యార్థి దశలో ఆడపిల్లలకు చేయూతనిచ్చినట్లయితే చక్కటి పౌరులుగా తయారవుతారని చెప్పారు. సహజంగా మహిళలకు మేధా సంపత్తి  ఎక్కువగా ఉంటుందని చెప్పారు.  వారికి అవకాశాలు కల్పించినట్లయితే వారి టాలెంట్ చూపిస్తారని చెప్పారు. ఎస్వీ అండ్ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్ మాట్లాడుతూ 29 సంవత్సరాల నుంచి విద్యార్థినులకు అనేక అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సాహిస్తున్నామని చెప్పారు. ఫలితంగా ఎంతో మంది డాక్టర్లుగా ఇంజనీర్లుగా ఎదిగారని చెప్పారు ఎక్కువ కూడా ఉండడం విశేషం అన్నారు. 29 ఏళ్లుగా ఎస్.వీ.ఎన్ స్కూల్ కు ప్రిన్సిపల్ కూడా మహిళ అని చెబుతూ ప్రిన్సిపాల్ మాధురి చేయూతతో  అనేకమంది విద్యార్థినులు పరిణతి పెంపొందిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. తాము మొదటి నుంచి విద్యార్థినులలో వికాసం కలిగించడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్న విషయాన్ని వివరించారు.

### ఆకట్టుకున్న జెండర్ ఈక్వాలిటీ ప్రదర్శనలు

జెండర్ ఈక్వాలిటీ ఎంత అవసరమో తెలియజెప్పే స్కిట్లను స్టూడెంట్స్ తమ అద్భుత హావ భావాలతో ప్రదర్శించారు ఇంటి నుంచే వివక్ష మొదలవుతుందని తల్లిదండ్రులు అమ్మాయిని నిరుత్సాహపరిచే విధంగా వ్యవహరించడంతోపాటు అబ్బాయిలకు అద్భుత ప్రోత్సాహాన్ని ఇచ్చే సన్నివేశాలను కళ్ళకు కట్టినట్లు విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థినులను ప్రోత్సహించాలని వారిలోని ప్రతిభ పాటవాలను వెలుగులోకి తీసుకురావాలని ఉద్దేశంతో ఈ స్కిట్లకు ఎస్.వీ.ఎన్ డైరెక్టర్ గొట్టిపర్తి వృతిక్ రూపకల్పన చేశారు. గత నాలుగు రోజులుగా వారికి శిక్షణ ఇస్తూ ప్రోత్సహించడంతో వారు ఎలాంటి భయం ఆందోళన లేకుండా చక్కగా ప్రదర్శించారు.









### సరికొత్త విద్యా ప్రణాళికతో వండర్ కిడ్స్:

సరికొత్త విద్యా ప్రణాళికతో యాదగిరిగుట్ట పట్టణంలో వండర్ కిడ్స్ స్కూల్ ను ఎస్.వీ.ఎన్ ప్రారంభించిందని ఎస్.వీ.ఎన్ డైరెక్టర్ గొట్టిపర్తి వృతిక్ తెలిపారు. అధునాత టెక్నాలజీని ఉపయోగించుకోవడంతో పాటు విద్యార్థులలోని క్రియేటివిటీని వెలుగులోకి తీసుకురావడానికి సరికొత్త విద్యా ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తూ ఒక విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేస్తున్నదని చెప్పారు. అంతేకాకుండా వచ్చే విద్యా సంవత్సరంలో నూతన భవనంలో సరికొత్త హంగులతో అధురాతన టెక్నాలజీకి మరింత శోభను చేకూర్చే విధంగా పాఠశాలను ప్రారంభించి అద్భుతమైనటువంటి ప్రగతిని సాధిస్తామని చెప్పారు. తల్లిదండ్రుల ఆదరాభిమానాలతో 29 సంవత్సరాల నుంచి వస్తున్న ఫీడ్ బ్యాక్ ను తీసుకొని సరికొత్తగా వండర్ కిడ్స్ స్కూల్ కు రూపకల్పన జరిగిందని చెప్పారు. తాము మొదటి నుంచి ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న నినాదంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అదే ఉద్దేశంతో బీసీ కాలనీ నుంచి జెండర్ ఈక్వాలిటీ కార్యక్రమాలను ప్రారంభించి విద్యార్థుల్లోనూ... తల్లిదండ్రుల్లోనూ ఆడపిల్లల పట్ల సరైన భావన కలిగించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తమ తల్లిదండ్రులు భాస్కర్, మాధురి లు ఇచ్చిన ప్రేరణ, స్ఫూర్తి వల్ల విదేశాలలో చదువుకున్నప్పటికీ ఈ ప్రాంతంలో విధ్యాఫలాలను అందరికీ అందించాలన్న తపనతో తాను సైతం పాఠశాల నిర్వహణలో భాగస్వామినీ అవుతున్న విషయాన్ని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి, జయ భారత్  యూత్ అధ్యక్షులు దండ్ల బాల నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టు సతీష్ రాజ్ తోపాటు గుండు నరసింహ, యూత్ సభ్యులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. వండర్ కిడ్స్ స్కూల్లో అడ్మిషన్ల కోసం 8434242494 నంబర్లు సంప్రదించాలని చెప్పారు.



















ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
16 ఫిబ్రవరి
2025



# గుట్ట గుడి 'విమానగోపుర' మహాకుంభ సంప్రోక్షణకు సర్వం సిద్ధం



**విమాన గోపురానికి పూర్తయిన స్వర్ణతాపడం బిగింపు పనులు**

**ఈ నెల 19 నుండి 23 వరకు 'మహాకుంభ సంప్రోక్షణ' మహెూత్సవాలు**

**23న స్వర్ణవిమాన గోపురానికి మహా కుంభాభిషేకం... సంప్రోక్షణ**

**23న ఉదయం 11:54 గంటలకు సీఎం రేవంత్ చేతుల మీదుగా కుంభ సంప్రోక్షణ**

**వానమామలై రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో పంచకుండాత్మక సుదర్శన నృసింహ యాగం...కుంభ సంప్రోక్షణ వివరాలు వెల్లడించిన ఈవో భాస్కరరావు**



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 'పంచకుండాత్మక మహాకుంభ సంప్రోక్షణ' మహెూత్సవాలకు సన్నాహాలు షురూ అయ్యాయి. నారసింహుడి గర్భగుడిపై ఉన్న పంచతల దివ్యవిమాన గోపురానికి స్వర్ణతాపడ బిగింపు పనులు శనివారంతో కంప్లీట్ కావడంతో.. సంప్రోక్షణ ఉత్సవాల పనులు ఊపందుకున్నాయి. మహాకుంభ సంప్రోక్షణ ఉత్సవాలకు సంబంధించి శనివారం ఆలయ ఈవో భాస్కర్ రావు పూర్తి వివరాలు వెల్లడించారు. ఈవో తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు పాంచరాత్ర ఆగమ శాస్త్రం పద్దతుల్లో 'స్వర్ణ దివ్యవిమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్టా మహెూత్సవాలు' జరగనున్నాయి. 19న స్వస్తివాచనం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ఉత్సవాలు ప్రారంభమై.. ఈ నెల 23న నిర్వహించే మహాకుంభ సంప్రోక్షణతో ముగియనున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 19 నుండి 23 వరకు 'పంచకుండాత్మక సుదర్శన నారసింహ మహాయాగం' చేపట్టనున్నారు. ఉత్సవాల చివరి రోజైన ఈ నెల 23న స్వర్ణమయమైన దివ్యవిమాన గోపురానికి మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించనున్నారు. 23న ఉదయం 11:54 గంటలకు మూల నక్షత్రం, వృషభ లగ్నంలో అర్చకులు.. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా స్వర్ణవిమాన గోపురంపై ఉన్న సుదర్శన చక్రానికి సంప్రోక్షణ పూజలు చేసి బంగారు దివ్యవిమాన గోపురాన్ని స్వామివారికి అంకితం చేయనున్నారు. ఈ ఉత్సవాలన్నీ వానమామలై పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో జరగనున్నాయి.

## విమాన గోపురానికి పూర్తయిన స్వర్ణతాపడ పనులు

నారసింహుడి గర్భగుడిపై 50.5 అడుగుల ఎత్తులో ఉన్న ఐదంస్తుల దివ్యవిమాన గోపురానికి బంగారు తాపడాల బిగింపు పనులు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద స్వర్ణగోపురంగా యాదగిరిగుట్ట నర్సన్న విమాన గోపురం రూపుదిద్దుకుంది. ఇందుకోసం 65 కిలోల 84 గ్రాముల బంగారాన్ని వినియోగించారు. విమాన గోపురం మొత్తం 10,753 స్క్వేర్ ఫీట్లు ఉండగా.. ఒక్కో స్క్వేర్ ఫీట్ కు 6 గ్రాముల బంగారం పట్టింది. ఐదు అంతస్తుల్లో ఉన్న విమాన గోపురానికి.. ఒక్కో అంతస్తులో 8 చొప్పున మొత్తం 40 దేవతామూర్తుల విగ్రహాలతో పాటు మరో 113 ప్రతిమలతో స్వర్ణతాపడం ఏర్పాటు చేశారు. దీనితో పాటు మరో 39 కలశాలకు సైతం స్వర్ణతాపడ పనులు ఫినిష్ అయ్యాయి. ఈ బంగారు తాపడ పనులు మొత్తం చెన్నైకి చెందిన ఎంఎస్ స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ చేపట్టింది. గతంలో ఆలయ ముఖద్వారం, ధ్వజస్తంభానికి చెందిన బంగారు తాపడ పనులను ఇదే సంస్థ పారదర్శకంగా చేయడంతో.. ప్రభుత్వ అనుమతితో విమాన గోపుర బంగారు తాపడ పనులను కూడా స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకే అప్పగించారు. 2024 డిసెంబర్ 1న మొదలైన విమాన గోపుర స్వర్ణతాపడ బిగింపు పనులు.. 2025 ఫిబ్రవరి 15న ముగిశాయి. ఈ నెల 17లోపు ఫినిషింగ్ పనులు మొత్తం కంప్లీట్ కానున్నట్లు ఈవో భాస్కర్ రావు తెలిపారు.

## సిద్దమైన యాగశాల

మహాకుంభ ప్రతిష్టాపన సంప్రోక్షణ పూజల్లో భాగంగా జరిపే 'పంచకుండాత్మక మహా సుదర్శన యాగం' కోసం యాగశాల సిద్దమైంది. ప్రధానాలయానికి ఈశాన్య దిశలో యాగశాలను ఏర్పాటు చేశారు. యాగశాలకు నలువైపులా నాలుగు ద్వారాలు ఏర్పాటు చేశారు. యాగశాలలో ఐదు కుండలాలతో జరిపే సుదర్శన యాగం కోసం ఐదు యజ్ఞగుండాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. ఈ నెల 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు జరిపే పంచకుండాత్మక సుదర్శన నృసింహ యాగం కోసం 'వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుధ్, మహాలక్ష్మి' పేర్లు గల ఐదు కుండలాలను ఏర్పాటు చేశారు. ఇక యాగానికి అవసరమయ్యే ఆవునెయ్యి, యజ్ఞగుండాలు కాల్చడానికి అవసరమయ్యే మోదుగు కర్రను సైతం అందుబాటులో ఉంచారు. మహాకుంభ సంప్రోక్షణ ఉత్సవాల్లో భాగంగా.. వానమామలై రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో.. 108 మంది రుత్వికులు, పారాయణీకులు, వేదపండితులతో సుదర్శన యాగం జరగనుంది. ఈ నెల 19న స్వస్తివాచనం, పుణ్యాహవచనం, విష్వక్సేనపూజతో మహా కుంభ సంప్రోక్షణ పూజలకు శ్రీకారం చుట్టి పంచకుండాత్మక సుదర్శన యాగానికి అంకురార్పణ చేయనున్నారు.





## 23న మహాకుంభ సంప్రోక్షణకు సీఎం రేవంత్ రెడ్డి.?

పంచకుండాత్మక మహాకుంభ సంప్రోక్షణ ఉత్సవాల్లో భాగంగా.. ఈ నెల 23న చేపట్టే మహాకుంభ సంప్రోక్షణకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, అసెంబ్లీ స్పీకర్, మండల చైర్మన్, ఎండోమెంట్ మినిస్టర్, జిల్లా మంత్రి, ప్రభుత్వ విప్, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రానున్నారు. ఎలక్షన్ కోడ్ ఉన్న కారణంగా.. సీఎం, మంత్రుల రాక కోసం ఈసీ అనుమతి కోరారు. కచ్చితంగా ఈసీ అనుమతి ఇస్తుందని ఈవో భాస్కర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా.. రోజుకు రెండు వేల భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. అలాగే లక్ష మందికి సరిపడా పులిహెూర ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు. మహాకుంభ సంప్రోక్షణ ఉత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికలను పలు రాజకీయ ప్రజా ప్రతినిధులు, అధికార ప్రతినిధులతో పాటు స్వర్ణతాపడానికి విరాళాలు ఇచ్చిన దాతలకు కూడా ఇవ్వనున్నారు. రూ.1 లక్షకు పైగా విరాళాలు ఇచ్చిన ప్రతి డోనర్ కు స్వయంగా వెళ్లి ఇన్విటేషన్లు అందజేయనున్నట్లు ఈవో భాస్కర్ రావు తెలిపారు.

# మార్చి 1 నుండి 11 వరకు గుట్ట బ్రహ్మోత్సవాలు

## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహిస్తాం: ఈవో. భాస్కర్ రావు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: మార్చి 1 నుండి 11 వరకు యాదగిరిగుట్ట దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఒకటిన స్వస్తివాచనంతో మొదలై 11న అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగియనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధానాలయ సముదాయానికి స్పెషల్ లైటింగ్ ఏర్పాటు చేయగా.. స్వాగత తోరణాలను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్, వరంగల్ సహా ప్రధాన నగరాల నుండి యాదగిరిగుట్టకు వచ్చే మార్గాలలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్య ఘట్టాలైన మార్చి 7న ఎదుర్కోలు, 8న తిరుకల్యాణం, 9న రథోత్సవం జరగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ చరిత్రలో మొదటిసారిగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గరికపాటి నరసింహారావుతో నృసింహ పురాణం ప్రచనాలు మొదటి మూడు రోజులు చేపట్టనున్నారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు, గాయకుడు గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ చేత సంగీత కచేరీలు, స్వామివారి కీర్తనలు, పాటల కార్యక్రమాలు చేపట్టనున్నారు.

### ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఉత్సవాలు : ఆలయ ఈవో భాస్కర్ రావు



**ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా మహాకుంభ సంప్రోక్షణ, వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నాం. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారంతో దివ్యవిమాన గోపురానికి స్వర్ణతాపడ పనులు కూడా కంప్లీట్ అయ్యాయి. ఈ నెల 19 నుండి 23 వరకు పంచకుండాత్మక మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహెూత్సవాలు.. మార్చి 1 నుండి 11 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నాం. కుంభ ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా.. ఈ నెల 23న మహాకుంభ సంప్రోక్షణ ద్వారా స్వర్ణమయమైన దివ్యవిమాన గోపురానికి సంప్రోక్షణ పూజలు చేసి స్వామివారికి అంకితం చేయనున్నాం.**

# రేపు రెండున్నర గంటలు నర్సన్న దర్శనాలు బంద్

**తిరుమంజన కారణంగా దర్శనాలు నిలిపివేత**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 17న మధ్యాహ్నం తర్వాత రెండున్నర గంటల పాటు దర్శనాలు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ఈ నెల 19 నుండి 23 వరకు ఆలయంలో నిర్వహించే మహాకుంభ సంప్రోక్షణ మహెూత్సవాల కోసం.. ఈ నెల 17న ఆలయంలో తిరుమంజన(ఆలయ శుద్ధి) కార్యక్రమం చేపట్టనున్నారు. ఇందుకోసం 17న మధ్యాహ్నం ఒంటిగంట నుండి 3:30 గంటల వరకు.. దాదాపుగా రెండున్నర గంటల పాటు భక్తులకు స్వామివారి దర్శనాన్ని నిలిపివేయనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ శుద్ధి అనంతరం యథావిధిగా దర్శనాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.



ప్రతి అక్షరం • ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
16 ఫిబ్రవరి
2025



# ఉపాధ్యాయుల గౌరవానికి Tr అనే గౌరవ సూచిక

**డాక్టర్ లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి**
**చైర్‌పర్సన్ - లోటస్ లాప్ పబ్లిక్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్,**
**జాతీయ సలహాదారు %-% పర్యావరణ పరిరక్షణ**
**మరియు అభివృద్ధి మండలి,**
**రాష్ట్ర సలహాదారు**



హైదరాబాద్, 14 ఫిబ్రవరి(రోమింగ్ న్యూస్): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తూ భవిష్యత్తు డాక్టర్లు, న్యాయమూర్తులు, సైనిక అధికారులు, నాయకులను తీర్చిదిద్దుతున్నారు. కానీ, డాక్టర్ల పేరుకు ముందు Dr న్యాయమూర్తులకు Justice, సైనిక అధికారులకు Captain, Major' వంటి గౌరవ సూచక పదాలు ఉంటే, వీరందరినీ తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవ సూచిక లేకపోవడం అన్యాయమేమి కాదు?

ఉపాధ్యాయుల విశిష్టతను గుర్తించి Tr. (Teacher) అనే గౌరవ సూచికను వారి పేరుకు ముందు వాడే సమయం ఆసన్నమైంది. ఇది వారి అభివృద్ధికి, సమాజంలో వారి గౌరవాన్ని పెంచడానికి ఒక నూతన ఒరవడిగా మారాలి.

### Tr ఎందుకు అవసరం?


- విద్యా నిపుణులు, పాలకులు, సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు ఉపాధ్యాయులకు కూడా ఇతర వృత్తులకు ఉన్నట్టుగా గౌరవ సూచిక ఉండాలని విశ్వసిస్తున్నారు. ఎందుకంటే:
- డాక్టర్లు వైద్య సేవల ద్వారా ప్రాణాలను రక్షిస్తారు – అందుకే Dr
- న్యాయమూర్తులు న్యాయాన్ని అమలు చేస్తారు – అందుకే Justice
- సైనికులు దేశ రక్షణ చేస్తారు – అందుకే Captain, Major
- ఈ వృత్తులన్నింటిని తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు ఎందుకు ప్రత్యేక గౌరవ సూచిక ఉండకూడదు?
- Tr ని అధికారికంగా అంగీకరించాలి
- ఉపాధ్యాయ వృత్తికి గౌరవాన్ని తీసుకురావడానికి Tr ను అధికారికంగా ప్రవేశపెట్టాలి. దీనివల్ల:
- ఉపాధ్యాయ వృత్తి ప్రతిష్ట మరింత పెరుగుతుంది
- ఉపాధ్యాయులకు సమాజంలో మరింత గౌరవం లభిస్తుంది
- విద్యా రంగంలో ఉన్న ప్రతిఒక్కరికీ ఒక గౌరవప్రదమైన గుర్తింపు ఏర్పడుతుంది
- ప్రభుత్వ పాలకులు & విద్యా సంస్థలకు విజ్ఞప్తి
- CBSE, ICSE, రాష్ట్ర విద్యా బోర్డులు, యూనివర్సిటీలను Tr' అనే గౌరవ సూచికను అధికారికంగా అంగీకరించాల్సిందిగా కోరుతున్నాం.
- ఫిన్లాండ్, సింగపూర్ వంటి దేశాల్లో ఉపాధ్యాయులకు గౌరవ సూచిక ఉంది. భారతదేశం కూడా ఈ మార్గంలో ముందడుగు వేయాలి.
- పాఠశాల నిర్వాహకులు & ఉపాధ్యాయ సంఘాలకు విజ్ఞప్తి
- Tr అనే గౌరవ సూచికను పాఠశాలల అధికారిక పత్రాలు, సర్టిఫికెట్లు, ఉపాధ్యాయుల గుర్తింపు కార్డులలో ప్రవేశపెట్టాలి.
- ఉపాధ్యాయ సంఘాలు, విద్యా సంస్థలు దీనిని ప్రభుత్వ అధికారిక ఆమోదం కోసం పిటిషన్ చేయాలి.
- మీడియా, ప్రజల మద్దతు అవసరం
- సామాజిక మాధ్యమాలలో #TrForTeachers #RecognizeTeachers హ్యాష్‌ట్యాగ్‌లతో ప్రచారం చేయండి.
- ఉపాధ్యాయుల సేవలను మీడియా ద్వారా ప్రచారం చేసి, వారికి గౌరవ సూచిక లభించేలా చేయండి.

### ఇప్పుడు చర్య తీసుకోవాల్సిన సమయం!

ఉపాధ్యాయులు ప్రపంచాన్ని తీర్చిదిద్దే మార్గదర్శకులు. వారి సేవలకు గౌరవం ఇవ్వడమే కాకుండా, పేరు ముందు Tr అనే గౌరవ సూచక పదాన్ని అధికారికంగా అంగీకరించడం సమాజ బాధ్యత.

# యాక్సిడెంట్ అయి చికిత్స పొందుతున్న యువకుడు మృతి

**చెల్లెలు పెళ్లి కోసం దుబాయ్ నుండి వచ్చి మృత్యు ఒడిలోకి అన్న..**
**తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ అన్న సోహైల్ శనివారం తుదిశ్వాస**
**మంగళవారం జరిగిన ప్రమాదంలో స్పాట్ లోనే బంధువు ఎండీ అస్లం మృతి**
**పెళ్లి ఇంట అలుముకున్న విషాదఛాయలు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఈ నెల 11న బైకును కారు వెనుక నుండి ఢీకొన్న ఘటనలో ఒకరు స్పాట్ లోనే చనిపోగా.. మరొకరు తీవ్ర గాయాలై హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం చనిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట శివారులోని వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవేపై ఇద్దరు యువకులు వెళ్తున్న బైకును వెనుక నుండి వేగంగా వచ్చిన కారు ఢీకొన్న ప్రమాదంలో.. హైదరాబాద్ కు చెందిన ఎండీ అస్లం(27) స్పాట్ లోనే చనిపోగా.. ఎండీ ఇబ్రహీం సోహైల్ అనే యువకుడికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ లోని గాంధీ హాస్పిటల్ కు తరలించారు. గత ఐదు రోజులుగా ట్రీట్‌మెంట్ పొందుతున్న ఇబ్రహీం సోహైల్(27) ఆరోగ్య పరిస్థితి విషమించడంతో.. శనివారం చనిపోయాడని డాక్టర్లు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

### చెల్లె పెళ్ళి కోసం దుబాయ్ నుండి వచ్చి మృత్యు ఒడిలోకి..

తన తోడబుట్టిన చెల్లె పెళ్లి కోసం దుబాయ్ నుండి హైదరాబాద్ కు వచ్చిన అన్న ఎండీ ఇబ్రహీం సోహైల్(27)ను మృత్యువు కబలించింది. ఈ నెల 21న తన చెల్లెలు పెళ్లి సందర్భంగా.. ఈ నెల 11న తన బంధువుతో కలిసి వెడ్డింగ్ కార్డులు పంచడం కోసం బైకు పై హైదరాబాద్ నుండి వరంగల్ వైపు వెళ్తుండగా.. యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట శివారులోకి చేరుకోగానే బైకును వెనుక నుండి కారు ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న ఎండీ అస్లం(27) అక్కడికక్కడే చనిపోగా.. బైక్ నడుపుతున్న ఎండీ ఇబ్రహీం సోహైల్(పెళ్లికూతురు అన్న) తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అప్పటినుండి హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన సోహైల్.. చెల్లెలు పెండ్లి కోసం హైదరాబాద్ వచ్చి తిరిగిరాని లోకానికి తరలిపోవడంతో.. పెళ్లి ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట చావుడప్పుల చప్పుళ్లు కుటుంబ సభ్యులను విషాదంలో ముంచెత్తాయి. పెళ్లిపత్రికలు పంచడానికి వెళ్లిన అన్న సోహైల్ తో పాటు బంధువు అస్లం విగతజీవులై ఇంటికి రావడంతో.. కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు, బంధువులను చూసి కాలనీవాసులు మొత్తం కంటతడి పెట్టారు.

# యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ ఫొటోకు ఎమ్మార్పీఎస్ క్షీరాభిషేకం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్టలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటోకు శనివారం క్షీరాభిషేకం చేశారు. మాదిగ ఉపకులాల చిరకాల కోరిక అయిన ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కలను నెరవేర్చినందుకుగానూ.. సీఎం రేవంత్ రెడ్డి, సబ్ కమిటీ సభ్యుల ఫొటోకు పాలాభిషేకం చేశామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంఛార్జ్ కూరేళ్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు బూషి మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే.. మొట్టమొదటిసారిగా ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని స్పందించిన ఏకైక సీఎం రేవంత్ రెడ్డి మాత్రమేనన్నారు. అంతేకాకుండా అమలుకు కూడా అంతే చిత్తశుద్ధితో సీఎం రేవంత్ ముందుకు సాగుతుండడం సంతోషంగా ఉందన్నారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరుల త్యాగఫలమే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఎమ్మార్పీఎస్, మాదిగలు ఎప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం మహేందర్, రాష్ట్ర కార్యదర్శి బైరపాక నాగరాజు, ఆలేరు నియోజకవర్గ ఇంఛార్జ్ బొట్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంగి స్వామి తదితరులు ఉన్నారు.

### నేడు జనగామకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాక

జనగామ, ఫిబ్రవరి 15:( రోమింగ్ న్యూస్) జనగామ జిల్లా కేంద్రానికి కేంద్ర మంత్రి,బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆదివారం రానున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి గెలుపు కోసం సూర్యాపేట రోడ్ లో కేమిస్ట్రీ భవన్ ఎదురుగా గార్డెన్లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఉపాధ్యా య ఓటర్ల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని అలాగే ఎన్నికల కొరకు దిశా నిర్దేశం చేస్తారని బిజెపి వర్గాలు తెలిపాయి . ఈ సందర్భంగా జనగామ అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలను కోరుతూ ఇక్కడ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి ఇక్కడి బిజెపి నాయకులు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

# మీడియాలో గిరిజన దృక్పథాలు అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్



విశాఖ, రోమింగ్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం "మార్జిన్స్ టు మెయిన్ స్ట్రీమ్ : మీడియాలో గిరిజన దృక్పథాలు" అనే థీమ్ పై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వంహించింది. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం, సోషల్ వర్క్ విభాగం కలిసి నిర్వహించిన వర్క్‌షాప్ లో మీడియా ప్రొఫెషనల్స్, అకడమీషియన్లు, విద్యార్థులు పాల్గొని, ప్రధాన సమాచార మాధ్యమాల్లో గిరిజన సముదాయాల ప్రాతినిధ్యం గురించి చర్చించారు. ఈ కార్యక్రమాన్ని మఖన్లాల్ చతుర్వేది జాతీయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ మాజీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ కెజి సురేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మార్జినలైజ్డ్ కమ్యూనిటీల స్వరాలను మీడియా ద్వారా ప్రసారం చేయడంలో మీడియా కీలక పాత్రను పోషించాల్సి ఉందని నొక్కి చెప్పారు. జర్నలిజంలో గిరిజనుల ప్రాతినిధ్యానికి మరింత సమగ్ర మరియు నైతిక విధానం అవసరమని అన్నారు. స్థానిక జ్ఞాన వ్యవస్థలు, సాంస్కృతిక గుర్తింపులను గౌరవించే కథనాలను రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు తన అధ్యక్ష ఉపన్యాసంలో, గిరిజనుల దృక్పథాలపై అర్థవంతమైన అకాడెమిక్ చర్చలను ప్రోత్సహించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతను పునరుద్ఘాటించారు. మీడియా నిరూపణలు గిరిజన సముదాయాల యొక్క నిజమైన జీవిత వాస్తవికతలను ఖచ్చితంగా ప్రతిబింబించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

సిజినెట్ స్వర సహ–స్థాపకుడు, జర్నలిస్ట్ శుభ్రాంశు చౌదరి మాట్లాడుతూ గిరిజన సముదాయాలను సాధికారత చేయడంలో సిటిజన్ జర్నలిజం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ది హిందూ ప్రిన్సిపల్ కరెస్పాండెంట్ అప్పల నాయుడు ప్రసంగిస్తూ గిరిజన సమస్యలపై తన విశ్లేషణను పంచుకున్నారు. గిరిజన సముదాయాలు మరియు ప్రధాన ప్రవాహ సమాజం మధ్య గల అంతరాన్ని తగ్గించేందుకు బాధ్యతాయుతమైన విలేఖరిత్వం అవసరమని ఆయన నొక్కిచెప్పారు. మీడియా ఎథిక్స్, పాలసీ ఫ్రేమ్ వర్క్, డిజిటల్ వేదికల పాత్ర తదితర అంశాలపై మేధోమథన చర్చలు నిర్వహించారు. గిరిజన దృక్పథాలకు ప్రధాన ప్రవాహ మీడియాలో సమానమైన ప్రాతినిధ్యం అందించేందుకు మీడియా నిపుణులు, అకడమీషియన్లు, విద్యార్థులు సంయుక్తంగా పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేస్తా

### యాదాద్రి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: బీజేపీ పార్టీ బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ తెలిపారు. జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. యాదగిరిగుట్ట ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. యాదాద్రి జిల్లాలో బీజేపీని మరింత పటిష్ఠం చేయాలని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని నూతన అధ్యక్షుడు అశోక్ గౌడ్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లాలో పార్టీ బాధ్యతలను తనకు అప్పగించిన కిషన్ రెడ్డికి, సహకరించిన మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో బూత్ లెవల్ నుండి బీజేపీని బలోపేతం చేయడం కోసం పని చేస్తానని తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మేక రాంరెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సేవాలాల్ అహింసావాదం అందరికీ ఆదర్శం

*యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు*

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: బంజారాల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ నమ్మి ఆచరణలో పెట్టిన అహింసావాదం అందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా.. యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామపంచాయతీ పరిధిలోని దేవనాయకులమర్రిలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. బంజారాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేసిన గొప్ప సంఘ సంస్కర్త సేవాలాల్ అని కొనియాడారు. బంజారాల సంస్కృతి సంప్రదాయాల కోసమే కాకుండా జాతి జాగృతి కోసం ఎన్నో హితబోధలు చేశాడని, అందుకే సేవాలాల్ ఇతర సామాజికవర్గాల ప్రజలకు కూడా ఆదర్శమూర్తిగా నిలిచారన్నారు. ప్రతిఒక్కరూ సేవాలాల్ అడుగు జాడల్లో పయనిస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, తహశీల్దార్ దేశ్యానాయక్ తదితరులు ఉన్నారు.



# ఆత్మవిశ్వాసం కోల్పోతున్న యువత

## జనగామలో రైలు కింద పడి యువకుని ఆత్మహత్య

జనగామ ఫిబ్రవరి 15: (రోమింగ్ న్యూస్) ఆధునికంగా ఎంతగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ నేటి యువతలో ఎక్కువ శాతం ఆత్మవిశ్వాసం కోల్పోతూ అసంతృప్తితో జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొందరు, అనారోగ్యంతో మరికొందరు, కుటుంబ సమస్యలు ఎదుర్కొనలేక ఇంకొందరు ఇలా అనేక కారణాలతో సతమతమవుతూ నేటి యువత కొద్దిమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. యువతలో నానాటికి పెరుగుతున్న నైరాశ్యన్ని రూపుమాపవలసిన బాధ్యత విద్యావంతులపై, ముఖ్యంగా టీచర్లపై అధికారులపై ఎంతగానో ఉంది అన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరు గమనించాలి. జనగామ జిల్లా రఘునాథ్ పల్లి మండల కేంద్రానికి చెందిన గంద్ర దినేష్ అనే 25 సంవత్సరాల యువకుడు శనివారం రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో జనగామ సమీపంలో కాజీపేట వైపు వెళ్లే దక్షిణ ఎక్స్‌ప్రెస్ కు ఎదురుగా రైలు పట్టాలపై పడుకొని నిండు ప్రాణాన్ని తీసుకున్నాడు. డిగ్రీ చదువు మధ్యలో ఆపి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చాలీచాలని జీతంతో బతకలేక మనస్థాపం చెంది ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తుంది. మున్నూరు కాపు కులానికి చెందిన రఘునాథ్ పల్లి గ్రామస్తుడైన గంద్ర శ్రీధర్ కుమారుడైన దినేష్ (25) ఈ విధంగా ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. జనగామ రైల్వే పోలీస్ అధికారులు రమణారెడ్డి, పి సి నరేష్ ల ఆధ్వర్యంలో సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు మీడియాతో మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికి యువత ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతూ అఘాయిత్యాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తుందని, నేటి యువతలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలని, ఈ దిశగా మేధావులు కృషి చేయాలని వారు కోరారు. ప్రతి సమస్యకు చావు పరిష్కారం కాదని చావదలుచుకున్నవారు, ఆత్మహత్య చేసుకోవాలనుకున్నవారు స్వచ్ఛంద సంస్థలను గాని నిజాయితీ గల అధికారులను గాని సంప్రదిస్తే చేరదీసి సహాయం చేసేవారు ఎంతోమంది ఉన్నారు అన్న విషయాన్ని నేటి యువత గుర్తించాలి అంతేగాని అనాలోచిత నిర్ణయాలతో ఆవేశంలో వివేకాన్ని కోల్పోయి తమ జీవితాలను చాలించుకుంటూ కుటుంబ సభ్యులను బాధ పెట్టడం ఎంత మాత్రం సమంజసం కాదు అన్న విషయాన్ని నేటి యువత గ్రహించాలి.

